



# అనాచ్ఛాదిత

వాడ్రేవు చినవీరభద్రుడు

చైత్ర మాసపు తొలిజాముల ఎండ. పైని వేపాకులూ, రావి ఆకులూ గల గల్లాడుతొన్నాయి. చిలకలు వేప పిందెల్ని కొరికి పడేస్తున్నాయి, ఎక్కణ్నుంచో బంజర్ల లోంచి ఆవుల అరపులు విన్పిస్తున్నాయి. పక్కన టైలరు శంకరమూర్తి మిషను చప్పుడు. పంచాయితీ ఆఫీసు దగ్గర పెద్ద మనుషులు రాజకీయ చర్చల్లో వున్నారు. చెరువు నుంచి నీళ్ళు తెచ్చుకుంటున్న ఆడవాళ్ళు నెమ్మదిగా పలచబడుతున్నారు – ఆ మెత్తని గ్రామీణ నీరవతలో నెమ్మదిగా కరిగిపోతో కునుకులోకి జారి పోయాను, ఎంత సేపో తెలీదుగాని. "ఏమిటలా మొద్దులా. ఎంత లేపినా, ఎండకి కాక ఎత్తడం లేదూ, ఇప్పుడు నిద్రేమిటి?

రాత్రి ఎక్కడికేనా వెళ్ళారేమిటి విశేషం, కాస్త లేవండి, మంచం నీడలోకి లాగుతాను. ఒదులుగా అల్లిన జడ వెంపల మీంచి ముందుకు జారి వూగుతోంటే, ఎప్పటిలాంటి తేట నవ్వుతో తీయని అర్థంలేని ప్రశ్నలు కురిపిస్తూ పార్వతి. కళ్ళల్లో అలముకొంటోన్న మధ్యాహ్నపు అలసట. ఆ కోల పెదాల మీది ఆ నిర్మలమైన చిరునవ్వులో చిలిపితనమో, వేదనో తెలియని ఒక నీల ఛాయ. నీళ్ళు తేవడంవల్ల తడిసిన బుజాల రహస్యమయిన పలకరింపు. "లేవండి, లేవండి..." అంటూ కదిలి పోబోయింది, కాని ఆమె కొంగు అందు కున్నాను. "ఏమిటిది? పొద్దుటిపూటా, మీ అమ్మగారు యిప్పటికే రెండుసార్లు కబురు చేసారు. ఇక్కడికి రాలేదని చెప్పాను, మీ నాన్నగారు బహుశా వీధులన్నీ గాలిస్తున్నారేమో కూడాను, ఈ పడుకునేదేదో హాయిగా ఆ యింట్లో పరుపుల మీద..." మాట పూర్తి కానివ్వకుంటానే ఆ పెదాల్ని అరచేత్తో ఆపి "చాలు, ఇంకా హంసతూలికా తల్పాలవ లేదు..." – ఎక్కువ మాటాడేందుకు బద్ధకం – అట్లానే



న్యూజెర్సీ తెలుగు కళాసమితి ఆధ్వర్యాన ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక నిర్వహించిన పోటీలో రు.50 గెలుచుకున్న కార్టూను

న్నాడో, నిజమో తెలీదుగాని... నాకు నిస్త్రాణ వచ్చేసింది. 'ఒద్దులే, రామయ్యా, ఇంకేమన్నా మాటాడు కుందాం' అంటుంటే "మన వాడికి వినడానికి బాధగా వున్నట్టుంది, ఒదిలేరా మనవాడికి మంచి ఫ్రెండు కూడా న" ప్రకాశరావు మాటల్లో వ్యంగ్యం గుచ్చుకుంది. నాకు ఒక్కసారిగా అక్కడందరిమీదా రోత పుట్టింది. కోప మొచ్చింది కూడా.'ప్రకాశరావు, నిజానికీ, పుకారుకీ మధ్య తేడా తెలియని వాణ్ణే కానులే' అన్నాను. "లేదు బాబూ, నిజమే బాబూ" శంకరమూర్తి నణుగుతున్నాడు "పందెం కాస్తావా" మొజెను పట్టుబడ్డాడు "నీ కళ్ళ ముందే మేం. దాన్ని పిలిచి.." ఆ రోజు వాళ్ళు అంతపనీ చేసి చూపించారు.. నేను అక్కడ నిల్చోలేకపోయాను, ఆ సన్నని జల్లులో, ఆ బురద లోనే వూరికి దూరంగా వెళ్ళిపోవాలనిపించింది. అట్లా పిచ్చిగానూ, అయోమయంగానూ నడుస్తున్న నన్ను పలక రింపుగా ఆపి సత్యనారాయణమూర్తి! ఆ క్షణంలో అతను చాలా వూరటగా అనిపించాడు. "ఏమిటేది, ఇలా వున్నారు" అన్నాడు. ఏం వేదంలో వెళ్ళిపోబోయాను, కాని అగి జరిగింది చెప్పాను. నేనతన్ని అదే మొదటిసారి కలవడం అన్న విషయం కూడా మర్చిపోయాను. అతను నీరసంగా నవ్వాడు. కొద్దిగా ముదురుతున్న మొహం, తీక్షణమయిన చూపు, ఒంకీలు తిరిగిన జుత్తు, వక్రంగా నవ్వుతో "దాని సంగతా, ఒదిలెయ్యండి. దాన్ని పెళ్ళిచేసుకుంటానన్నాను, పూజితం వుండొద్దూ, మీరెందుకు వర్రీపడటం, ఇంటికెళ్ళిపోండి, వాన పెద్దదయ్యేట్టుంది" అని నాలుగ్గు అడుగులు వేసి "మీకో రహస్యం తెలుసా? దాన్ని మొట్టమొదట చెరిచిన వాడు మీ ఫ్రెండు ప్రకాశరావే, ఇంటికి పాఠాలు చెప్పించు కోడానికి వస్తే మనవాడు పక్కలోకి లాక్కున్నాడు. అదే చెప్పింది నాకు. దాన్నసలు షూట్ చేసి పారెయ్యాలనిపించింది.. అవునూ, ఇట్లాంటి మదపిచ్చి వాళ్ళని ఇంగ్లీషులో ఏదో అంటారని విన్నాను. ఏమిటది?" అన్నాడు. 'నింఫోమానియాక్' అని అనబోయి 'ఏమో, నాకూ తెలీదు' అన్నాను. ఆ పదాన్ని అతనికి ఎవరూ చెప్పకుండా వుంటే బాగుణ్ణనుకున్నాను.

ఆ రాత్రి పెద్దవాన లోకాన్ని వేళ్ళతో పెకలిస్తున్నట్టు కురిసింది. దబదబమని బయట ఎవరో తలుపులు బాదుతున్నట్టు వానకురుస్తోంటే గదిలో ఒక్కణ్ణీ నిద్రపట్టక అప్రిమితంగా గోడల్ని వున్న దేవుళ్ల పటాలని, మా బంధువుల, పూర్వీకుల ఫోటోల్ని చూస్తూ అటూ యిటూ దొర్లాను. బయట వురుములు, మెరుపులు, మెరిసినప్పుడల్లా, ప్రపంచం కాంతిమంతం అవుతోంది కాబోలు, కాని ఎవరి కోసం, ఏం ప్రయోజనం? ఎవరో దేవుడు టార్చిలైటు వేసుకుంటూ మురికిపట్టిన గదిని మరీమరీ కడుగుతున్నట్టు వాన.

నా గదిలో నా శయ్యమీద ఒక అస్పష్ట ఆకృతిగా పార్వతి కూర్చున్నట్టు అనిపించింది. కాని నేను ఆ ఆకృతిని చూసి భయపడటం లేదు, ఆ ఆకృతే నన్నుచూసి భయపడుతోంది. ఇంకా మానవ ముఖాకృతుల్ని చూసి తట్టుకోగలగడం అలవాటు కానట్టుగా. ఆ ఆకృతి నన్ను ఏదో ప్రశ్నించడానికి


# తపాల్ మూలముగా చిత్రకళ!




బొమ్మలు చిత్రించుటకును
వర్ణ చిత్రములు చిత్రించు కళను అభ్యసింపవలెనా
28 సం॥లుగా మీ అభిమానానికి, శక్తి చాతుర్యానికి
పేరు ప్రసిద్ధి చెందిన "చందును విద్యాలయ"
నుండి తపాల్ మూలముగా తమిళము, ఇంగ్లీషు, మలయాళము, తెలుగు, హిందీ బాషలలో
యింటి నుండే మీరు చిత్రములు వేయు సామర్ధ్యం, నేర్పు చక్కగా అభ్యసించగలరు.

వివరములకు 90 పైసల స్టాంపుతోపాటు అప్లికేషన్ పంపవలసినది.

విలాసం : చందును చిత్ర విద్యాలయ
C/o చిత్రకొళను (J), 179 సింగన్న వీధి, చింతాద్రిపేట, మద్రాసు-2.

న్యూజెర్సీ తెలుగు కళాసమితి ఆధ్వర్యాన ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక నిర్వహించిన పోటీలో
రు.50 గెలుచుకున్న కార్టూను




ప్రయత్నిస్తూ ఆగిపోతూ వుంది. ఆమె అలా ప్రయత్నించి నపుడల్లా నాలో కొత్త ప్రకంపనలు. కాని మధ్యలో వాత్స ల్యంతో 'పెద్దవాడివయ్యావన్న మాట' అని నెమ్మదిగా జుత్తు దువ్వుతూ అన్నట్లు అనిపించి అరచేతుల్తో ముఖాన్ని కప్పు కున్నాను. ఎన్నిసార్లు ఆ దేహాన్ని యీ అరచేతుల్తో తడిమాను. ఒళ్ళంతా వేడి చిమ్ముతోంటే, అవయవాలు కెరటాల్లా ఎగిసిపడతోంటే- ఏదో అశక్తతతో ఎన్నోసార్లు స్థాణువుగా వుండిపోయాను. దాటలేనిదీ, తెరవకూడనిదీ, చేయకూడ నిదీ నిజంగా

ఏదన్నా వుందా? అది శరీరంతో మాత్రమే సాధ్యమవు తుందా? నాకు తెలియంది ఆ అమ్మాయికి తెలిసిందా? తెలుసుకోవడానికి మనిషి చెల్లించాల్సిన మూల్యం విషాద కరమా? లేక ఆ తెలుసుకోవడమే విషాదకరమా? ఆమె మెత్తని పొట్టమీద ముద్దుపెట్టుకోవడం, అవాళ, స్నానాలగది లో దృశ్యం... ఏవేవో నాలో కదులుతున్నాయి. కళ్ళు తెరిచాను. ఆ ఆకృతి తన పొట్టను చూపిస్తూ ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది. ముద్దుపెట్టుకొమ్మని మాత్రం కాదు. నాకు ఆక్షణంలో ఆ ఆకృతిని పూర్తి నగ్నంగా చూడాలనిపించింది. కాని తట్టుకోగలనా? ఆ ఆకృతి సగం భ్రమ, సగం వాస్తవం. సత్యనారాయణమూర్తి ఎంత దుర్మార్గుడు. నాన్న అతన్నెం దుకు సపోర్టు చేస్తాడో? అతనికి సమితి ప్రెసిడెంటు దగ్గర వున్న పలుకుబడి కేనా? నాన్న అప్పుడప్పుడు పార్వతితో వేళాకోళాలు ఆడుతుండేవాడు. ఆ క్షణాన నాకు ఎవరితోనో లేచిపోయిన మా దూరపుబంధువు మందరమ్మ గుర్తొచ్చింది. అందరూ అమ్మతో సహా ఆమెను తిట్టనివాళ్ళు లేరు. నాన్నమాత్రం ఎప్పుడూ ఆమె గురించి ఒక్కమాట కూడా అనలేదు. నర్సింరాజు వాళ్ళ నాన్నకి ఉంపుడుగత్తె వల్ల కలిగాడట. ఈ రహస్యాన్ని నాన్న ఎందుకు అంతలా గుర్తు పెట్టుకున్నాడు?

బయట పెళపెళ వాన. ఏదో మగతగా కల, కలత నిదుర. నర్సింరాజు సోమినాయుడు పెళ్ళాన్ని అమెరికా తీసుకు పోయినట్టు, సత్యనారాయణ మూర్తిని మోజెస్ షూట్ చేసినట్టు, ప్రకాశరావు సర్పంచ్ అయినట్టు, నాన్న?!

## 4

రెండు మూడేళ్ళ తరువాత. అప్పటికి నా యింజనీరింగ్ స్టడీస్ పూర్తి అయిపోయాయి. కాంట్రాక్టులు మొదలు పెట్టాను. నాన్న ఎమ్మెల్యే అయ్యాడు. పనిమీద వూరికి వచ్చాను. పండగముందు. ఊరు ఈ కాస్తలోనే బాగా పెరిగిపోయింది. మరొక సినిమా హాలు, చిన్న పెద్ద తామర తంపరగా షాపులు, జూనియర్ కాలేజీ, పంచదార ఫేక్టరీ. మనుషుల్లో ఇదివరకటి తీరికతనం లేదు. కొత్త వ్యాపకత్వాలు. మునుపటి కన్నా పెరిగిన నాణేల గలగల.

శీతాకాలపు చివరి దినాలు. మధ్యాహ్నం తీరిగ్గా పడక కుర్చీలో నాలి పేపరు చదువుతుండగా ఓ నోణిపిల్ల ఇంట్లోకి దూసుకొస్తూ "బాగున్నారా" అంటే మొదట గుర్తుపట్టలేక పోయాను. పార్వతి చెల్లెలు దుర్గ. " మా అక్క అత్తారింటి నుంచి వచ్చింది. పండుగయ్యేదాకా ఇక్కడే వుంటుంది, మీరొచ్చారని చెబుతాను మరి". అంది.

పార్వతికి పెళ్ళయిందా? ఆశ్చర్యపోయాను. అమ్మనడిగితే చెప్పింది. "చాలా వైభవంగా జరిగింది పెళ్ళి. నర్సింరాజుగారు అసలు పిల్ల పెళ్ళి చేస్తాడని అనుకున్నామా? ఎంత గొప్పగా చేశాడని. వూరు వూరంతా కదిలివచ్చింది పెళ్ళికి. వెన్నెట్లో. ఆ మాటలంటున్నప్పుడు ఆమె కన్నుల్లో వింత వెలుగు. "పాపం ఆ పిల్లని ఊరంతా ఆడిపోసుకున్నారు. అన్నెం పున్నెం ఎరుగని పసిదాన్ని పట్టుకుని నానామాటలు అన్నారు. నిజానిజాలు దేవునికి తెలియవా?" అమ్మని పరిశీలనగా చూశాను. ఆవిడ పాపిట తెల్లబడుతోంది. ఆమె మాటలను బట్టి ఆమెకి ఏమీ తెలియదని అనుకోవాలో, లేక నిజంగా తెలిస్తే ఆమెకి మాత్రమే తెలుసుననుకోవాలో. "అత చేస్తుంటాడు?" "అతను బాగా దిగువదేశంలో ఎక్కడో... వాళ్ళ వూరు, మిల్లులో పనిట. రాజులే. నేను పెళ్ళిలో చూశాను కదా! కనుముక్కు తీరు బాగానేవుంది. బుద్ధి మంతుడే" అంది. నాలోనేను అనుకుంటున్నట్టుగా అన్నాను. "పోన్లే, ఇన్నాళ్ళకు సుఖపడిందన్నమాట" అని లేవబోతుంటే

"ఏం సుఖమో ఏమోలే వెర్రిపిల్ల, పెళ్ళి ఆరునెలలు కాలేదు, ఏ రాత్రివేళ ఏమయిందో గాని దెయ్యం పట్టిందట. అంతా ఒంట్లోనుంచి ఊడ్చేసిందనుకో. చిక్కిపోయింది. నాల్రోజులు గాలి మారుతుందని ఇటు వచ్చింది"అని కాసేపాగి, అనాలా, వద్దా అన్నట్టుగా నెమ్మదిగా "అదేమిటోరా వచ్చి అప్పుడే రెణ్ణెల్లు అవుతోందా, అల్లుడొక్కసారీ రాలేదురా, నాకు తెలియకడుగుతాను, వాళ్ళకి సెలవులుండవా?" అంది.

నాకు పార్వతిని చూడాలని ప్రబలంగా అనిపించింది. వాళ్ళింటికి వెళ్ళగానే ముందు ఆశ్చర్యపోయాను. పుష్య మాసపు సంధ్యవేళ. వాకిట్లో నులకమంచం వాల్చి ఓ మాసిన దుప్పటి పరిచింది. ఆ ఇంట్లో పండుగ రాబోతున్న కళ ఏమీలేదు. వెల్ల వెయ్యక మాసిన గోడలు, అటూ ఇటూ గలీజుగా తిరుగుతున్న కోళ్ళూ, అరుగుమీద వగరుస్తున్న కుక్క.. చూపుల్ని పార్వతిమీదకి మరల్చాను. ఆమె నేను చూసిన ముసలివాళ్ళందరిలోకి ముసలిదానిలా వుంది. ఏ శరీరాన్నయితే ఆమెనుంచి వేరుగా ఊహించలేకపోయేవాడినో, ఆ శరీరం ఇలా పరిణమిస్తుందని ఎన్నడూ ఊహించలేదు. "బాగున్నారా చినబాబూ" వాడిన పెదాలపైని మరింత నీలవర్ణపు జీవంలేని చిరునవ్వు. చిన్నపుడు వాళ్ళ నాన్నగారి చొక్కాలు లూజుగా తొడుక్కుని, ఇంకా ఎదిగీ ఎదగని రొమ్ముల అస్పష్ట రేఖాకృతితో కన్పించిన పార్వతికీ, ఈ పార్వతికీ మధ్య ఎంత తేడా. కానీ ఆ పలకరింపులో మాత్రం ఏ తేడా లేదు. అప్పుడూ ఇప్పుడూ ఒకే మార్దవం. అప్పుడు ఊహలు చప్పుడయితే, ఇప్పుడు గడచిన దినాలు మూల్గు తున్నాయి. ఏదో ప్రేతం ఆవహించినట్టే వుందామె. మాటల మధ్యనే లోపల నుంచి పళ్ళెంలో పెట్టి పాకుండలు తెచ్చి పెట్టింది. "ఏమిటి గోడలకు వెల్ల వేయించినట్టు లేదు" అన్నాను. ఆ మాటకు ఆమె తల్లి శోకపడింది. బహుశా ఒక బయటివాడు ఆ ఇంటికొచ్చి అంత ఆత్మీయతగా పలకరిం చడం అదే మొదటిసారేమో! "ఏం చెప్పను బాబూ! ఆయనకు ఇల్లు పట్టదు. ఉన్న పొలమంతా సోమినాయుడి చేతిలో పెట్టేశారు. వాడు నిరుటిదాకా ఎంతో కొంత ఇచ్చేవాడు. ఈ ఏడు అదీ మానేశాడు. పండగ్గదా, ఈయనకు కోడి పందేలు. ఇదిగో, దీని సంగతి చూస్తే ఇలావుంది, నాకేమో పొద్దల్లా సుగర్ ఫేక్టరీలోనే గడిచిపోతోంది. ముసలి దాన్నయిపోతున్నాను, నేను మాత్రం ఎంతకాలం తాపత్రయ పడగలను?" నేను ఆవిడను తలెత్తి చూడలేకపోయాను. ఆమె బాల్యం గొప్ప వైభవంగా గడిచిందని పార్వతి చెప్పే... "మీ చదువులు పూర్తయిపోయాయా?" పార్వతి అడు... తూనే పళ్ళెంలో అరిసెలు వెయ్యబోతోంది. "అమ్మో అన్ని తినలేను" అంటూ ఆమె చేతిని పట్టుకుని ఆపేస్తుంటే - మళ్ళీ ఆ స్పర్శ. ఎన్నాళ్ళ తర్వాతనో. ఆ క్షణాన స్పష్టంగా చెప్పలేను కాని, నాకు ఆ బంధాలనుంచి, పరిమితుల నుంచి విముక్తిచెందినట్టనిపించింది. నా శరీరం నుంచి బయటపడి,

కురుమద్దాలి విజయలక్ష్మి నవల పెట్టె తీసి చూడు త్వరలో ప్రారంభం

ఏదో పదిలంగా నిలబడే ఒకేఒక మహత్తరక్షణాన జీవించినట్టు. కానీ ఆ వెంటనే భయమూ, దిగులూ కమ్మేశాయి. ఆ చేతిని చూశాను. నల్లగా ఒడిలిపోయిన చర్మం, ఆ రిస్టుని ఒక నాసిరకం వాచి. "టైమెంతయింది?" అన్నేను. "అది తిరగడం మానేసింది లెండి, ఊరికే ఇలా వుంచాను" అంది. ఇక ఏమీ మాటలు కనిపించలేదు. ఏమిటిలా చిక్కిపోయావు పార్వతీ? అనో, 'మీ ఆయన నిన్ను బాగా చూస్తాడా?' అనో ఏవేవో అడగాలని ఉంది కాని, నిజంగా ఏమని అడగగలను? మొట్టమొదటిసారిగా పార్వతి రెండు పార్వతులుగా కనిపించింది నాకు. ఒడిలిపోయిన శరీరంతో, రోగంతో, బీదరికంతో మగ్గుతున్న పార్వతి.ఆ పార్వతిమీద నేను జాలిచూపించగలను, సాయం చెయ్యగలను.."అన్నట్టు మీరుచూసిచెప్పండి, డాక్టర్ చీటీ ఇచ్చాడు. ఆ మందులు ఎక్కడ దొరుకుతాయో చెప్పండి" అంటూ బాగా నలిగిపోయిన ఒక ప్రిస్క్రిప్షన్ తీసుకువచ్చింది. దాన్ని బహుశా రోజూ విప్పి చూసుకుని మళ్లీ లోపల దాస్తోంది కాబోలు. అది వాళ్ళ అత్తారి ఊరిలో ఎవరో లోకల్ ప్రాక్టీషనర్ ఇచ్చింది. నాకున్న పరిజ్ఞానంతో నేను అర్థం చేసుకోగలిగినదాన్ని బట్టి ఆ అమ్మాయికి వున్న రోగమేమిటో తెలుసుకోగలను. తలెత్తి చూస్తే, అంతదాకా ఆసక్తిగా నన్నే చూస్తున్న కళ్ళని ఎటో తిప్పింది. ఆమెకు కూడా తెలుసా? "ఇవి అజీర్తికోసం రాసిన మందులు, ఇంత ఇండైజేషన్ ఎందుకొచ్చింది?" అని అడిగాను. అజీర్తి అంటే చినబాబూ! వేళకి తిండి, నిద్ర వుండవండీ అక్కడ. ఆయనకేమో షిఫ్టు డ్యూటీలు. అన్నం వేడిగా వుంటే సయించదాయనకి. నేను ఆయనకోసం ఆగడంలో, అరుగుదల పూర్తిగా చెడిపోయింది. అని పార్వతి చెప్తూవుంటే

> **అలంకారం**
>
> మానుకైనా మనిషికైనా
> అలంకారం
> చిగురో పొగరో
>
> **కవీ!**
>
> కవీ ఆత్మహత్య చేసుకో
> నీ కవిత్వం
> నిట్టూర్పుల సమాధి కట్టుకుంది.
>
> —డాక్టర్ సి. నారాయణరెడ్డి

"పైగా బండెడు చాకిరీ బాబూ, కట్నం తేలేదని వాళ్ళ అత్తగారు ఒకటే సాధిస్తుంది దీన్ని" వాళ్ళమ్మ అందుకుంది. నేను ఏం మాట్లాడగలను? గొంతు పెగుల్చుకుని "ఎలాగో ఒకలా సర్దుకుపోవాలి" అంటుంటే చలిగాలి లాగా పార్వతి కళ్ళల్లో హిస్టీరిక్ చిరునవ్వు. మంచురాత్రుల ఒణుకు. ఎక్కడో తళతళల మెరుపులు. ఉరుముతూ ఫెళఫెళా వాన. ఏదో ఆకృతి నగరుస్తూ నన్ను వాటేసుకుంటూంది... ఈ ప్రిస్క్రిప్షన్ ఏ మందులషాపు వాడికన్నా అర్థమవుతుంది. నాకెందుకు చూపించిందని? - నేను పర్సు తీసి యాభై రూపాయలు లెక్కపెట్టి 'అన్నట్టు పార్వతీ, మర్చిపోయాను. ఒకసారి మీ నాన్నగారి దగ్గర యాభై రూపాయలు అప్పు తీసుకున్నాను. ఎప్పటికప్పుడు ఇద్దామనుకుంటూనే మరిచి పోతున్నాను. వుంచగలవా? అన్నాను. ఆమె చీర కొంగు బుజాలచుట్టూ లాక్కుంటూ, చేతుల్ని చెంపలకాన్చుకుని "మా నాన్నగారి డబ్బులు మా నాన్నగారికే ఇవ్వండి" అంది. నాకేమనాలో తోచలేదు. నా దుస్తులూ, నళ్ళూ నాకే బరువుగా, ఇబ్బందిగా అనిపించాయి. అన్నీ వదిలేసుకుని, ఫ్రీగా, ధైర్యంగా నడవాలనిపించింది. పార్వతి కొన్ని క్షణాలు నన్నట్లానే చూస్తూ నిలబడింది. "పోన్లెండి మీ బాకీ ఎప్పుడన్నా తీరుద్దురు గాని, ఇది నాకు పండుగకు చీరె ఇచ్చారని అనుకుంటాను" అంది. నేను తలెత్తి చూడలేక పోయాను. ఆమె గాజుల సవ్వడి సన్నగా వినిపిస్తోంది. దుస్తులు ధరించి కూడా అవి అంటీ అంటని నగ్నమూర్తిని నలుగురిలో చూడగల సాహసం నాకుందా? ఆ క్షణాన ఆ రోగిష్టి పార్వతి పక్కగా నిరాకార అయిన ఒక స్త్రీ నిల్చుని నన్ను తన వక్షానికి అన్చుకుని "పెద్దవాడి నయ్యాననుకుంటున్నావా, నాన్నా, నువ్వు ఎప్పుడూ పసివాడివేరా" అంటున్నట్టుగా తోచింది. అలా తోచడం నాపట్ల నా సానుభూతి అనుకోవాలో, ఏ గొప్ప వ్యక్తికో ఎత్తిన నీరాజనమే అనుకోవాలో తేల్చుకోవడం నావల్ల గాని పని అనుకున్నాను. ఒక్క నమస్కారం పెట్టాను. ఎవరికి? ఏమో? -మరుక్షణంలో లేచి బయటకు వచ్చేసాను.

